సాక్షి ఖమ్మం

మంగళవారం । 19 । ఆగస్టు । 2025



ఇంత జరిగినా నిర్లక్ష్యమే..

కల్లూరు గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాల నిర్వహణలో అధికారుల నిర్లక్ష్యంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. 8లో



ఎన్నడూ ఎరగని కష్టం

యూరియా కోసం ఎన్నడూ తిప్పలు పడని రైతులు.. ప్రస్తుతం పీఏసీఎస్‌ల వద్ద తెల్లవారు జాము నుంచే బారులు దీరుతున్నారు. 8లో

గరిష్టం / కనిష్టం 29° / 23°

వాతావరణం

జిల్లాలోని పలు ప్రాంతాల్లో మంగళవారం ఓ మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉంది. వాతావరణం చల్లగా ఉంటుంది.

న్యూస్‌రీల్

విద్యార్థులకు తపాలా స్కాలర్‌షిప్‌లు

ఖమ్మంగాంధీచౌక్ : దీన్‌ దయాళ్‌ స్పర్శ యోజన పథకం కింద 2025 – 26 సంవత్సర పిలాటలీ స్కాలర్‌షిప్‌ పథకానికి 6 నుంచి 9వ తరగతి మధ్య చదువుతున్న విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఖమ్మం డివిజన్‌ పోస్టల్‌ సూపరింటెండెంట్‌ వి.వీరభద్ర స్వామి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పిలాటలీ క్విజ్‌, ప్రాజెక్టు కార్యక్రమాలను పోస్టల్‌ డివిజనల్‌, రీజనల్‌/సర్కిల్‌ స్థాయిలో నిర్వహించనున్నామని తెలిపారు. ఈ కార్యక్రమాల్లో ప్రతిభ కనబర్చిన వారికి నెలకు రూ. 500 చొప్పున ఏడాదికి రూ. 6 వేలు అందిస్తామని తెలిపారు. విద్యార్థులు తమ దరఖాస్తులను 'సూపరింటెండెంట్‌ ఆఫ్‌ పోస్టాఫీసెస్‌, ఖమ్మం డివిజన్‌, ఖమ్మం 507003' అడ్రస్‌కు సెప్టెంబర్‌ 13 లోగా పంపించాలని తెలిపారు. మరిన్ని వివరాలకు www.indiapost.gov.in వెబ్‌సైట్‌ ద్వారా తెలుసుకోవచ్చని సూచించారు.

21న జిల్లాస్థాయి అథ్లెటిక్స్‌ ఎంపికలు

ఖమ్మం స్పోర్ట్స్‌ : నగరంలోని సర్దార్‌ పటేల్‌ స్టేడియంలో ఈనెల 21న జిల్లా స్థాయి అథ్లెటిక్స్‌ ఎంపికలు నిర్వహిస్తున్నట్లు జిల్లా అథ్లెటిక్స్‌ అసోసియేషన్‌ కార్యదర్శి ఎం.డి.షఫీక్‌ అహ్మద్‌ ఒక ప్రకటనలో తెలిపారు. అండర్‌ –14, 16, 18, 20 బాలబాలికలకు ఎంపికలు జరుగుతాయని, ఆసక్తి గలవారు వయసు ధ్రువీకరణ పత్రాలతో హాజరు కావాలని పేర్కొన్నారు. జిల్లా జట్టుకు ఎంపికైన వారిని ఈనెల 30, 31 తేదీల్లో మహబూబ్‌నగర్‌లో జరిగే రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్‌ చాంపియన్‌షిప్‌ పోటీలకు పంపిస్తామని తెలిపారు. క్రీడాకారులు 21న ఉదయం 9 గంటలకు స్టేడియంలో రిపోర్టు చేయాలని సూచించారు.

విస్తారంగా వర్షాలు

కొనసాగుతున్న అల్పపీడన ప్రభావం

ఖమ్మంవ్యవసాయం: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా జిల్లా వ్యాప్తంగా విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. ఆదివారం రాత్రి నుంచి వర్షం సోమవారం రాత్రి వరకు వాన కొనసాగుతూనే ఉంది. వాతావరణ శాఖ తెలిపిన వివరాల ప్రకారం.. ఆదివారం రాత్రి కల్లూరు మండలంలో అధికంగా 27.6 మి.మీ. వర్షపాతం నమోదు కాగా, ఖమ్మం రూరల్‌ మండలంలో 17.6, బోనకల్‌లో 14.2, ముదిగొండ, సత్తుపల్లిలో 12.8, చింతకానిలో 11.4, ఖమ్మం అర్బన్‌లో 10.2 మి.మీ. నమోదు కాగా, మిగిలిన మండలాల్లో 10 మి.మీ. లోపు వర్షపాతం నమోదైంది. సోమవారం ఉదయం నుంచి రాత్రి 7 గంటల వరకు జిల్లా వ్యాప్తంగా వర్షపు జల్లులు కొనసాగుతూనే ఉన్నాయి. మధిర మండలం సిరిపురంలో 11.3, రావినూతలలో 10.3 మి.మీ. వర్షపాతం నమోదు కాగా, మిగిలిన ప్రాంతాల్లో 10 మి.మీ.లోపు వర్షపాతం నమోదంది. అయితే ఎగువన కురిసిన వర్షాలతో జిల్లా మీదుగా ప్రవహించే వాగుల్లో వరద ఉధృతి కొనసాగుతోంది. మున్నేరు, బుగ్గవాగు తదితర వాగులు పొంగి ప్రవహిస్తున్నాయి.

విద్యుత్‌ వినియోగదారులు అప్రమత్తంగా ఉండాలి..

విస్తారంగా వర్షాలు కురుస్తున్న నేపథ్యాన విద్యుత్‌ వినియోగదారులు, ప్రధానంగా రైతులు అప్రమత్తంగా ఉండాలని ఖమ్మం విద్యుత్‌ సర్కిల్‌ ఎస్‌ఈ ఇనుగుర్తి శ్రీనివాసా చారి సోమవారం ఒక ప్రకటనలో కోరారు.


గోదావరిలో వరద ఉధృతి



భద్రాచలం కరకట్ట వద్ద గోదావరి వరద ఉధృతికి నీట మునిగిన స్నానపు గదులు

భద్రాచలంఅర్బన్‌/దుమ్ముగూడెం: భద్రాచలం వద్ద గోదావరిలో వరద ఉధృతి మూడు రోజుల నుంచి క్రమంగా పెరుగుతోంది. కొద్ది రోజులుగా కురుస్తున్న వర్షాలతో వాగులు, వంకలు పొంగిపొర్లడంతోపాటు ఎగువన ఉన్న కాళేశ్వరం తదితర ప్రాజెక్ట్‌ల నుంచి వరదనీరు వస్తోంది. దీంతో సోమవారం మధ్యాహ్నం ఒంటి గంటకు భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం 36.50 అడుగులకు చేరింది. సాయంత్రం 5 గంటలకు 37.70 అడుగులకు పెరిగింది. నది ఒడ్డున మెట్లప్రాంతంలోని తాత్కాలిక స్నానపు గదులు నీటమునిగాయి. దుమ్ముగూడెం మండలంలోని పర్ణశాల, కాశీనగరం, సున్నంబట్టి, దుమ్ముగూడెం వద్ద గోదావరి ఉధృతంగా ప్రవహిస్తోంది. పర్ణశాలలోని నారచీరల ప్రాంతంలో ఉన్న సీతమ్మవారి విగ్రహం పూర్తిగా నీట మునిగింది. సున్నంబట్టి–బైరాగులపాడు గ్రామాల మధ్య రహదారిపైకి వరదనీరు చేరి రాకపోకలు నిలిచిపోయాయి.

విద్యుత్‌ లైన్లు.. ఇక భూ గర్భంలో!





ఖమ్మం పట్టణం (ఇన్‌సెట్‌) మధిరలో అండర్‌గ్రౌండ్‌ విద్యుత్‌ లైన్ల ఏర్పాటుకు మ్యాపును పరిశీలిస్తున్న డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క, ఎన్‌పీడీసీఎల్‌ సీఎండీ వరుణ్‌రెడ్డి తదితరులు (ఫైల్‌)

మధిర, ఖమ్మం కార్పొరేషన్‌లో ఏర్పాటుకు కసరత్తు

- రెండు చోట్లా కలిపి రూ.1,268.05 కోట్లతో ప్రతిపాదనలు
- ప్రభుత్వ ఆమోదం పొందగానే నిధులు విడుదల
- బెంగళూరులో ఈ విధానంపై జిల్లా అధికారుల అధ్యయనం

సాక్షి ప్రతినిధి,ఖమ్మం : గాలి, వానతో విద్యుత్‌ తీగలు తెగడంతో గంటల పాటు సరఫరాకు అంతరాయం.. వేలాడే తీగలతో ఏదో ఒక చోట ప్రమాదం వంటి ఘటనలు తరచూ జరుగుతూనే ఉంటాయి. భూ ఉపరితలంపై ఓవర్‌ హెడ్‌ విద్యుత్‌ లైన్లతో కలిగే ఈ సమస్యల పరిష్కారానికి భూగర్భ విద్యుత్‌ లైన్ల ఏర్పాటుకు అడుగులు పడుతున్నాయి. దేశంలోని బెంగళూరు నగరంలో కొన్ని ప్రాంతాలు, ముంబై నగరమంతటా ఈ సిస్టమ్‌తో విద్యుత్‌ సరఫరా విజయవంతంగా సాగుతోంది. రాష్ట్రంలో హైదరాబాద్‌లోని పలు ప్రాంతాల్లో కూడా ఈ విధానాన్ని ఏర్పాటు చేస్తుండగా.. జిల్లాలో ఖమ్మం కార్పొరేషన్‌, మధిర మున్సిపాలిటీల్లోనూ అమలుకు విద్యుత్‌శాఖ అధికారులు ప్రభుత్వానికి డీపీఆర్‌ పంపించారు. నిధులు విడుదల కాగానే ఈ రెండు ప్రాంతాల్లో భూగర్భ విద్యుత్‌ లైన్‌ పనులు ప్రారంభం కానున్నాయి.

అక్కడి సిస్టమ్‌ పరిశీలించి..

ఈ ఏడాది జూన్‌ 27 నుంచి మూడు రోజులు పాటు జిల్లా విద్యుత్‌ శాఖ ఎస్‌ఈ శ్రీనివాసాచారి నేతృత్వంలో ముఖ్య అధికారులు బెంగళూరులో పర్యటించి అండర్‌ గ్రౌండ్‌ విద్యుత్‌ సిస్టంపై అధ్యయనం చేశారు. భూగర్భ లైన్ల ఏర్పాటు, ట్రాన్స్‌ఫార్మర్లు, వీధి లైట్ల కోసం ప్రత్యేకంగా వేసిన లైన్లు, వాటి నిర్వహణపై బెంగళూరుకు చెందిన విద్యుత్‌ అధికారులతో చర్చించారు. విద్యుత్‌ సరఫరాలో ప్రయోజనాలు, సమస్యలు, మానిటరింగ్‌ తదితర వివరాలు అడిగి తెలుసుకున్నారు. క్షేత్ర స్థాయికి వెళ్లి ట్రాన్స్‌ఫార్మర్లు, లైన్లను పరిశీలించారు. ఆ తర్వాత ఖమ్మం కార్పొరేషన్‌, మధిరలో ఈ విద్యుత్‌ సిస్టమ్‌ ఏర్పాటుకు కావాల్సిన ప్రతిపాదనలను ప్రభుత్వానికి అందించారు.

ఖమ్మం, మధిరలో ఏర్పాటు..

జిల్లాలో తొలుత ఖమ్మం కార్పొరేషన్‌, మధిర మున్సిపాలిటీల్లో ఈ విద్యుత్‌ సిస్టమ్‌ అమలుకు ప్రభుత్వం నిర్ణయించింది. ఈ రెండు చోట్లా ఉన్న విద్యుత్‌ కనెక్షన్లు, ట్రాన్స్‌ఫార్మర్లు, 33 కేవీ, 11 కేవీ, ఎల్‌టీ లైన్లు ఎన్ని కిలోమీటర్లు వంటి వివరాలతో ప్రభుత్వానికి డీపీఆర్‌(డీటెయిల్డ్‌ ప్రాజెక్టు రిపోర్టు) పంపారు. రెండు ప్రాంతాల్లో కలిపి అంచనా వ్యయం రూ.1,268.05 కోట్లు అవుతుందని అందులో పేర్కొన్నారు. ఖమ్మం కార్పొరేషన్‌కు రూ.1,241.96 కోట్లు, మధిరకు రూ.26.09 కోట్లు అవసరమని చూపారు. మధిర మెయిన్‌రోడ్డులో ఆత్కూరు క్రాస్‌ రోడ్డు నుంచి దెందుకూరు వరకు తొలిదశ కింద ప్రతిపాదనలు వెళ్లగా.. ఖమ్మం కార్పొరేషన్‌ పరిధిలో ఎన్నెస్టీ రోడ్డు, పీఎస్‌ఆర్‌ రోడ్డులో రూ.14.35 కోట్లు వ్యయంతో ఈ లైన్లు వేయనున్నారు. ఆ తర్వాత మిగతా అన్ని ప్రాంతాల్లో ఈ లైన్ల పనులు చేపడతారు.

ఏమిటీ విద్యుత్‌ లైన్‌..

ప్రస్తుతం కనిపిస్తున్న విద్యుత్‌ కనెక్షన్లు, తీగలు, స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్ల వంటివి భూగర్భ విద్యుత్‌ లైన్లలో కనిపించవు. కొన్ని ట్రాన్స్‌ఫార్మర్లు మాత్రమే పైకి కనిపిస్తాయి. సిమెంట్‌ లైనింగ్‌ కాల్వలో ఇసుక పోసి ప్రత్యేకంగా తయారు చేసిన పైపుల్లో విద్యుత్‌ తీగలు వేసుకుంటూ వెళ్తారు. నైపుణ్యం ఉన్న ఎలక్ట్రికల్‌ సిబ్బందితో మాత్రమే ఈ పనులు చేయిస్తారు. అంతేకాక ఈ విద్యుత్‌ మానిటరింగ్‌కు కొన్ని కిలోమీటర్లకు ఒక పర్యవేక్షణ సెంటర్‌ ఏర్పాటు చేస్తారు. ఈ విద్యుత్‌ సరఫరాలో ఎక్కడా ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఈ సెంటర్‌ నుంచి టెక్నీషియన్లు నిత్యం కంప్యూటరైజ్డ్‌ మానిటరింగ్‌ చేస్తారు. రూ.4 కోట్ల విలువైన చెకింగ్‌ మిషన్‌ వ్యాన్‌.. సరఫరాలో సమస్య ఎక్కడ వచ్చిందో క్షణాల్లోనే గుర్తిస్తుంది. దీంతో వెంటనే మరమ్మతులు చేసి సరఫరా పునరుద్ధరిస్తారు.

అంతరాయం, ప్రమాదాలు లేకుండా..



అండర్‌గ్రౌండ్‌ విద్యుత్‌ లైన్‌ సిస్టమ్‌తో అంతరాయం లేకుండా కరెంట్‌ సరఫరా అవుతుంది. భూ ఉపరితలంపై ఉన్న లైన్లతో ఇన్సూలేషన్‌ ఉండదు. పట్టుకున్నా.. చెట్టుకొమ్మ పడినా ట్రిప్‌ అవుతుంది. అండర్‌గ్రౌండ్‌ సిస్టమ్‌లో ఐరన్‌, సిమెంట్‌ స్తంభాలు ఉండవు. ట్రాన్స్‌ఫార్మర్లు మాత్రమే ఉపరితలంపై ఉంటాయి. ఈ సిస్టమ్‌తో ప్రమాదాలు జరగవు. జిల్లాలో మధిర మున్సిపాలిటీ, ఖమ్మం కార్పొరేషన్‌లో ఈ విద్యుత్‌ లైన్ల ఏర్పాటుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం. ఈ సిస్టమ్‌ అమలుపై ఇటీవల బెంగళూరు నగరానికి వెళ్లి పరిశీలించాం.

– ఇనుగుర్తి శ్రీనివాసాచారి, విద్యుత్‌ శాఖ ఎస్‌ఈ

ఖమ్మం కార్పొరేషన్‌, మధిర టౌన్‌లో ప్లానింగ్‌ ఇలా..

వివరాలు	ఖమ్మం	మధిర
కనెక్షన్లు	1,20,094	1,474
ట్రాన్స్‌ఫార్మర్లు	2,175	61
33 కేవీలైన్‌ కి.మీ.	65.49	0.5
11 కేవీ లైన్‌ కి.మీ.	286.418	18.076
ఎల్‌టీ లైన్‌ కి.మీ.	645.358	12.036
అంచనా వ్యయం	రూ.1,241.96 కోట్లు	రూ.26.09 కోట్లు

యూరియా సరఫరాపై దృష్టి సారించాలి

కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్‌లో మంత్రి తుమ్మల

ఖమ్మం అర్బన్‌ : వానాకాలం పంటల సాగుకు అవసరమైన యూరియా సకాలంలో రైతులకు అందేలా కలెక్టర్లు ప్రత్యేక దృష్టి సారించాలని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సూచించారు. సోమవారం హైదరాబాద్‌ సచివాలయం నుంచి ఆయన అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్‌ నిర్వహించి యూరియా, ఎరువుల లభ్యతపై సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. మే చివరి వారం నుంచి కురిసిన వర్షాల కారణంగా రైతులు ఒకేసారి విస్తారంగా వరి, పత్తి, మొక్కజొన్న తదితర పంటలు సాగు చేశారని, ప్రస్తుతం రెండు లక్షల మెట్రిక్‌ టన్నుల బఫర్‌ స్టాక్‌తో సరఫరా కొనసాగుతోందని తెలిపారు. రాబోయే 15 రోజుల పాటు యూరియా సరఫరాపై కలెక్టర్లు ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని, మండలాల వారీగా స్టాక్‌ను పర్యవేక్షించి అవసరమైన చోటుకు తరలించాలని ఆదేశించారు. జిల్లా నుంచి హాజరైన కలెక్టర్‌ అనుదీప్‌ దురిశెట్టి మాట్లాడుతూ.. జిల్లాలో యూరియా కొరత లేదని, రైతులు ఎక్కడా ఇబ్బంది పడకుండా ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేస్తున్నామని చెప్పారు. అవసరమైన చోట సరఫరాకు వెంటనే చర్యలు తీసుకుంటామని తెలిపారు. సమావేశంలో డీసీపీ ప్రసాద్‌రావు, డీఏఓ పుల్లయ్య, జిల్లా సహకార అధికారి గంగాధర్‌, మార్కెటింగ్‌ అధికారి అలీమ్‌, మార్క్‌ఫెడ్‌ అధికారి సునీత తదితరులు పాల్గొన్నారు.

సమయపాలన పాటించాలి

- ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించండి
- అధికారులకు కలెక్టర్‌ ఆదేశం

ఖమ్మం సహకారనగర్‌ : కలెక్టరేట్‌లోని వివిధ శాఖల అధికారులు, సిబ్బంది ఫేస్‌ రికగ్నైజేషన్‌ సిస్టం ద్వారా హాజరు నమోదు చేయడంతో పాటు సమయపాలన పాటించాలని కలెక్టర్‌ అనుదీప్‌ దురిశెట్టి అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో అదనపు కలెక్టర్లు డాక్టర్‌ పి.శ్రీజ, పి.శ్రీనివాసరెడ్డితో కలిసి ఫిర్యాదులు స్వీకరించారు. అనంతరం మాట్లాడుతూ.. జనవరి ఒకటి నుంచి ఇప్పటివరకు మున్సిపల్‌ కార్పొరేషన్‌ వద్ద 37, డీఈఓ వద్ద 28, సర్వే ల్యాండ్‌ రికార్డ్స్‌ 26, ఎన్‌పీడీసీఎల్‌ 22, జీజీహెచ్‌ 17, వైద్యారోగ్య శాఖ 8, పంచాయతీరాజ్‌ శాఖ వద్ద ఏడు ప్రజావాణి దరఖాస్తులు పెండింగ్‌ ఉన్నాయని వివరించారు. వీటితో పాటు సీఎం ప్రజావాణి పెండింగ్‌ దరఖాస్తులను జిల్లా అధికారులు త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. కార్యాలయాలకు ప్రజాప్రతినిధులు పంపే ప్రతీ దరఖాస్తుకు సమాధానం ఇవ్వాలని, ఆ పని పూర్తి చేయలేకుంటే అందుకు గల కారణాలు తెలుపుతూ లేఖ రాయాలని సూచించారు. కార్యక్రమంలో డీఆర్‌ఓ ఎ.పద్మశ్రీ, జెడ్పీ సీఈఓ దీక్షారైనా, డీఆర్‌డీఓ సన్యాసయ్య, కలెక్టరేట్‌ ఏఓ కారుమంచి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



ఫిర్యాదులు స్వీకరిస్తున్న కలెక్టర్‌ అనుదీప్‌ దురిశెట్టి

ఫిర్యాదుల్లో కొన్ని ఇలా..

- ఖమ్మం రూరల్‌ మండలం మంగళగూడెం గ్రామానికి చెందిన కొప్పుల బుచ్చమ్మ.. తన భర్త నుంచి వారసత్వంగా సంక్రమించిన భూమి తన పేరున రెవెన్యూ రికార్డుల్లో నమోదుకు కుమార్తెలు అడ్డుపడుతూ, వృద్ధాప్యంలో ఉన్న తనను ఇబ్బంది పెడుతున్నారని ఫిర్యాదు చేసింది.
- ఖమ్మం నగరానికి చెందిన జోగుపర్తి వెంకమ్మ.. తన ఇద్దరు కుమారులపై గతంలో ఫిర్యాదు చేశానని, కలెక్టర్‌ గత ఫిబ్రవరిలో జారీ చేసిన ఆర్డర్‌ను వారు పాటించడం లేదని తెలపగా సీనియర్‌ సిటిజన్‌ సంరక్షణ చట్ట ప్రకారం అవార్డు అమలయ్యేలా చూడాలని డీడబ్ల్యూఓకు సూచించారు.
- వేంసూర్‌ మండలం మర్లపాడుకు చెందిన పిల్లి సర్వేష్‌ తనకు దివ్యాంగ పెన్షన్‌ మంజూరు చేయాలని కోరాడు.

వరద పరిస్థితిపై సీసీ కెమెరాలతో నిఘా..

గతేడాది వచ్చిన అనూహ్య వరదల దృష్ట్యా ముందు జాగ్రత్తలకు పటిష్ట చర్యలు చేపడుతున్నట్లు కలెక్టర్‌ అనుదీప్‌ తెలిపారు. సోమవారం తన చాంబర్‌లో ఆకేరు, మున్నేరుల వద్ద ఏర్పాటుచేసిన సీసీ కెమెరాల పనితీరును పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ముందస్తుగా వరద పరిస్థితి తెలుసుకొని, సహాయక చర్యలు చేపట్టేలా ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు. వరదల సమాచారం తెలుసుకునేందుకు ఆకేరుకు సంబంధించి తిరుమలాయపాలెం మండలం తిప్పారెడ్డిగూడెం వద్ద, మున్నేరుకు సంబంధించి డోర్నకల్‌ వద్ద సోలార్‌ డే అండ్‌ నైట్‌ విజన్‌ కెమెరాలు ఏర్పాటు చేసి, 24/7 గంటల పర్యవేక్షణ చేయనున్నామని వెల్లడించారు. ఈ కెమెరాలను కలెక్టరేట్‌లోని కంట్రోల్‌ రూమ్‌, తన చాంబర్‌కు అనుసంధానం చేసినట్లు తెలిపారు. 24 గంటలు నీటి ప్రవాహం ప్రత్యక్షంగా చూస్తూ, ప్రమాద పరిస్థితిని ముందస్తుగా అంచనా వేసి, అవసరమైతే ముంపు ప్రాంతాల ప్రజలకు నష్టం వాటిల్లకుండా సురక్షిత ప్రాంతానికి లేదా పునరావాస కేంద్రాలకు తరలించేలా చర్యలు చేపట్టవచ్చన్నారు. ఈ కెమెరాలతో అధికారులు మొబైల్‌ ఫోన్ల ద్వారా పర్యవేక్షించవచ్చన్నారు. నగరంలోని కాల్వొడ్డులోనూ ఈ తరహా కెమెరా ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఇరిగేషన్‌ డీఈ రమేష్‌ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సీసీ ఫుటేజీని పరిశీలిస్తున్న కలెక్టర్‌ అనుదీప్‌

సర్వాయి పాపన్న పోరాట స్ఫూర్తితో ముందుకెళ్లాలి

ఖమ్మంమయూరిసెంటర్‌: సర్దార్‌ సర్వాయి పాపన్న గౌడ్‌ పోరాట స్ఫూర్తితో ముందుకెళ్లాలని కలెక్టర్‌ అనుదీప్‌ పిలుపునిచ్చారు. బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన జయంతి వేడుకల్లో పాపన్న గౌడ్‌ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్‌ మాట్లాడుతూ.. సమానత్వం, స్వాభిమానం కోసం 400 సంవత్సరాల క్రితమే గొంతెత్తిన మహనీయుడు పాపన్న అని కొనియాడారు. వివక్షకు గురైన వర్గాలను ఐక్యం చేసి ముందుకు సాగారని తెలిపారు. బలహీనవర్గాల కోసం రాష్ట్ర ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలు చేపడుతోందని వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా బీసీ సంక్షేమాధికారిణి జి.జ్యోతి, డీసీహెచ్‌ఎస్‌ డాక్టర్‌ రాజశేఖర్‌ గౌడ్‌, బీసీ సంఘాల నాయకులు కత్తి నెహ్రూ గౌడ్‌, బొమ్మా రాజేశ్వరరావు, జి శంకర్‌రావు, ఎస్‌.స్వరూప, ఎం.లింగయ్య, ఎస్‌.సురేష్‌, ఎ.కృష్ణ, డి.ఉపేందర్‌, జి.వెంకన్న, షేక్‌ షకీన, మొక్క శేఖర్‌ గౌడ్‌, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

యూజీడీ పనులు నాణ్యంగా ఉండాలి

మధిర: మధిర మున్సిపాలిటీ పరిధిలో జరుగుతున్న అండర్‌ గ్రౌండ్‌ డ్రైనేజీ నిర్మాణ పనులను నాణ్యతతో, వేగంగా పూర్తి చేయాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు అధికారులను ఆదేశించారు. సోమవారం ఆయన హైదరాబాద్‌లోని సచివాలయంలో మధిర పట్టణ సమగ్రాభివృద్ధిపై సమీక్ష సమావేశం నిర్వహించారు. నెలకు ఒకసారి మున్సిపల్‌ ఇంజనీర్‌ ఇన్‌ చీఫ్‌ (ఈఎన్‌సీ), ప్రతి 15 రోజులకు సీఈ స్థాయి అధికారులు విధిగా అండర్‌ గ్రౌండ్‌ డ్రైనేజీ పనులను పరిశీలించాలని భట్టి సూచించారు. నాణ్యతతో అండర్‌ గ్రౌండ్‌ డ్రైనేజీ పనుల ప్రగతికి సంబంధించి ప్రతి వారం, 15 రోజులు, నెల రోజుల వ్యవధిలో టార్గెట్లు నిర్దేశించుకుని ప్రాజెక్టును పూర్తి చేయాలన్నారు. ఈ పనులపై ప్రజలకు అవగాహన కల్పించడంలో వార్డు కౌన్సిలర్లను భాగస్వాములను చేయాలని అన్నారు. ఈ ప్రాజెక్టు పనులపై తాను తరచూ సమీక్ష చేస్తానని తెలిపారు. అమృత్‌ పథకం కింద జరుగుతున్న అభివృద్ధి పనులు, జాలిమూడి నుంచి మధిర పట్టణానికి తాగునీటి సరఫరా తదితర అంశాలను సమీక్షించారు. నెల రోజుల్లో అంబేద్కర్‌ స్టేడియం పనులు పూర్తి చేయాలన్నారు. మధిరలో చెత్తను పూర్తిగా డంపింగ్‌ యార్డ్‌కు తరలించాలి తప్ప రహదారుల వెంట కనిపించొద్దని స్పష్టం చేశారు. పర్యాటక, మున్సిపల్‌, రోడ్లు భవనాల శాఖల అధికారులు సమన్వయం చేసుకొని ట్యాంక్‌ బండ్‌, ఇతర సుందరీకరణ పనులను పూర్తి చేయాలని ఆదేశించారు. సమావేశంలో మున్సిపల్‌ అర్బన్‌ డెవలప్‌మెంట్‌ సెక్రటరీ శ్రీదేవి, పబ్లిక్‌ హెల్త్‌ ఈఎన్సీ భాస్కర్‌ రెడ్డి, మధిర మున్సిపల్‌ కమిషనర్‌ సంపత్‌ తదితరులు పాల్గొన్నారు.



సమీక్ష సమావేశంలో అధికారులతో మాట్లాడుతున్న మల్లు భట్టి విక్రమార్క

సౌర విద్యుత్‌కు ప్రతిపాదనలు సమర్పించాలి

ఖమ్మంవ్యవసాయం : ప్రభుత్వ కార్యాలయాలపై సోలార్‌ విద్యుత్‌ ప్యానళ్ల ఏర్పాటుకు నిర్ణీత నమూనాల్లో ప్రతిపాదనలు సమర్పించాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్‌ డాక్టర్‌ పి.శ్రీజ జిల్లా అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్‌ పి.శ్రీనివాసరెడ్డితో కలిసి ఆమె సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. జిల్లాలో ప్రతి ప్రభుత్వ భవనంపై వీలైనంత మేరకు సోలార్‌ ప్యానళ్ల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రభుత్వ కార్యాలయాల విద్యుత్‌ బిల్లుల వివరాలు, రూఫ్‌ టాప్‌ ఏరియా, యూఎస్‌సీ నంబర్‌, కేటగిరీ(ఎల్‌టీ/హెచ్‌టీ) వంటి వివరాలను ప్రొఫార్మాలో పొందుపర్చాలని తెలిపారు. జిల్లాలో 4,700కు పైగా ప్రభుత్వ విద్యుత్‌ కనెక్షన్లు ఉన్నాయని తెలిపారు. ఈ మొత్తానికి 30 మెగావాట్ల సోలార్‌ విద్యుత్‌ ఉత్పత్తి అవకాశాలు ఉన్నట్లు ఆ శాఖ అధికారులు అంచనాలు వేశారని తెలిపారు. సమావేశంలో డీఆర్‌ఓ పద్మశ్రీ, జెడ్పీ సీఈఓ దీక్షారైనా, డీఆర్‌డీఓ సన్యాసయ్య పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్‌ శ్రీజ

చేప పిల్లల ఉత్పత్తి ప్రక్రియ ప్రారంభం

వైరా: వైరాలోని మత్స్య విత్తన క్షేత్రంలో సోమవారం చేప పిల్లల ఉత్పత్తి ప్రక్రియను జిల్లా మత్స్య శాఖాధికారి శివప్రసాద్‌ ప్రారంభించారు. రాష్ట్ర ప్రభుత్వం, మత్స్య శాఖ నిర్దేశించిన లక్ష్యం ప్రకారం చిప్పర చిరు చేపలు 50 లక్షలు, చిరు చేప పిల్లలు 14 లక్షలు పెంచాలని నిర్ణయించారు. ఈ మేరకు చేపల నుంచి గుడ్లసేకరణ కార్యక్రమాన్ని చేపట్టినట్లు మత్స్య శాఖాధికారులు తెలిపారు.



చేప గుడ్ల సేకరణ చేపడుతున్న శివప్రసాద్‌

టెండర్లకు గ్రీన్‌ సిగ్నల్‌..

- జిల్లాలో 3.49 కోట్ల చేప పిల్లలకు అనుమతి
- టెండర్‌ దాఖలుకు సెప్టెంబర్‌ 1 తుది గడువు
- డీపీసీ పర్యవేక్షణలో ప్రక్రియ నిర్వహణ

ఖమ్మంవ్యవసాయం: చేప పిల్లల టెండర్లకు ప్రభుత్వం గ్రీన్‌ సిగ్నల్‌ ఇచ్చింది. ప్రభుత్వ ఆనుమతి మేరకు చేప పిల్లల టెండర్ల ప్రక్రియ నిర్వహించాలని రాష్ట్ర మత్స్యశాఖ కమిషనర్‌ నిఖిల సోమవారం ఆదేశాలు జారీ చేశారు. జిల్లాలో 882 చెరువుల్లో చేప పిల్లల పెంపకానికి మత్స్యశాఖ అనుమతులు ఇచ్చింది. ఈ చెరువుల్లో నీటి లభ్యత తదితర అంశాలను పరిగణనలోకి తీసుకుని చేప పిల్లలు వదిలేందుకు అవసరమైన ప్రణాళికలు చేశారు. విస్తారంగా కురిసిన వర్షాలతో జిల్లాలో జలాశయాల్లోకి నీరు చేరడంతో చేప పిల్లల పెంపకానికి మెరుగైన వనరులున్నాయి.

జిల్లాలో 3.49 కోట్ల చేప పిల్లలకు..


జిల్లాలో జలాశయాల విస్తీర్ణం, వనరుల ఆధారంగా 3.49 కోట్ల చేప పిల్లలకు టెండర్లు నిర్వహించాలని రాష్ట్ర మత్స్యశాఖ అనుమతులు ఇచ్చింది. ఈ మేరకు దీర్ఘకాలం, స్వల్పకాలం నీటి సౌకర్యం ఉండే జలాశయాలను గుర్తించి వివిధ సైజుల్లో ఉన్న చేప పిల్లలను వదిలేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నారు. 35 – 40 మి.మీ. సైజు చేప పిల్లలు 1.38 కోట్లు కాగా 80 – 100 మి.మీ. సైజు చేప పిల్లలు 2.11 కోట్ల పిల్లలకు టెండర్లు నిర్వహించాలని ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు.

సెప్టెంబర్‌ 1 వరకు అవకాశం..

చేప పిల్లల టెండర్లకు సెప్టెంబర్‌ 1వ తేదీ సాయంత్రం 3 గంటల వరకు అవకాశం ఇచ్చారు. ఈ – ప్రొక్యూర్‌మెంట్‌ ప్లాట్‌ఫాంపై కాంట్రాక్టర్లు టెండర్లను అప్‌లోడ్‌ చేయాల్సి ఉంటుంది. టెండర్లు వేసేవారికి చేప పిల్లల పెంపకానికి అవసరమైన చెరువులు ఉండాలి. కనీసం మూడేళ్ల పాటు చేప పిల్లల పెంపకం, టెండర్ల ప్రక్రియలో పాల్గొన్న అనుభవం వంటి అర్హతలను ప్రామాణికంగా తీసుకుని అనుమతి ఇస్తారు. ఈ ప్రక్రియలో కాంట్రాక్టర్లు ఈఎండీ రూ. 8.50 లక్షలు చెల్లించాల్సి ఉంటుంది.

డీపీసీ పర్యవేక్షణలో..

చేప పిల్లల పథకానికి రూపొందించిన జిల్లా పర్చేజింగ్‌ కమిటీ పర్యవేక్షణలో టెండర్ల ప్రక్రియను నిర్వహిస్తారు. ఈ కమిటీకి చైర్మన్‌గా అదనపు కలెక్టర్‌ పి.శ్రీనివాసరెడ్డి వ్యవహరిస్తుండగా, సభ్యులుగా జిల్లా మత్స్యశాఖ అధికారి శివప్రసాద్‌, జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్‌ బి.పురంధర్‌, ఎలక్ట్రానిక్‌ జిల్లా మేనేజర్‌ ఉంటారు. ఈ కమిటీ పర్యవేక్షణలో టెండర్ల నిర్వహణ ఉంటుంది. సెప్టెంబర్‌ 1వ తేదీ 3 గంటల వరకు టెండర్లను నిర్వహించి ఆ తరువాత ఓపెన్‌ చేస్తారు. తక్కువ ధరకు కోట్‌ చేసిన వారికి కాంట్రాక్ట్‌ అప్పగిస్తారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రక్రియను నిర్వహిస్తున్నట్లు జిల్లా మత్స్యశాఖ అధికారి శివప్రసాద్‌ తెలిపారు.



చేప పిల్లలు

క్లుప్తంగా

కేంద్ర పన్నుల ఆదాయంలో రాష్ట్రాల వాటా ఎంత?

ఖమ్మంమయూరిసెంటర్: కేంద్ర పన్నుల నికర ఆదాయంలో 2024 – 25 ఆర్థిక సంవత్సరానికి రాష్ట్రాలకు రావాల్సిన వాటా ఎంత..? అని ఖమ్మం పార్లమెంట్ సభ్యులు రామసహాయం రఘురాంరెడ్డి లోక్‌సభలో ప్రశ్నించారు. పార్లమెంట్ వర్షాకాల సమావేశాల్లో భాగంగా సోమవారం ఈ అంశాన్ని ప్రస్తావిస్తూ రాష్ట్రాలకు వాటాపై 15వ ఆర్థిక సంఘం సూచన, ప్రభుత్వం చేపట్టిన అధికార వికేంద్రీకరణ స్థాయి, రాష్ట్ర నిర్దిష్ట గ్రాంట్ల వివరాలను తెలపాల్సిందిగా కోరారు. దీనికి కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌదరి లిఖితపూర్వక సమాధానమిచ్చారు. రాష్ట్రాల వాటా రూ.12.86 లక్షల కోట్లు. 2024 – 25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి పన్నులు, సుంకాల నికర ఆదాయంలో రాష్ట్రాల వాటా మొత్తం రూ.12,86,885.44 కోట్లు ఉన్నట్లు తెలిపారు. 41 శాతం తక్కువగా ఉందా..? అని ఎంపీ ప్రశ్నించగా 15వ ఆర్థిక సంఘం ఆమోదించిన సిఫార్సుల ప్రకారం ఉన్నట్లు పేర్కొన్నారు. స్థానిక సంస్థలకు కేంద్రం నేరుగా ఎలాంటి పన్ను కేటాయించలేదని తెలిపారు.

ముమ్మరంగా వాహనాల తనిఖీ



డ్రంకెన్ డ్రైవ్ టెస్ట్ చేస్తున్న ఎస్ఐ

ఖమ్మంక్రైం: సీపీసునీల్‌దత్ ఆదేశాల మేరకు అడిషనల్ డీసీపీప్రసాద్‌రావు పర్యవేక్షణలో ఆదివారం అర్ధరాత్రి దాటిన తర్వాత పోలీసులు డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు చేపట్టారు. అనుమానాస్పద వ్యక్తుల వేలిముద్రలు సేకరించారు. మద్యం సేవించి పట్టుబడిన వాహనదారులపై కేసు నమోదు చేశారు. ప్రమాద నివారణ చర్యలు చేపట్టారు. ఈ ఏడాది జనవరి నుంచి ఆగస్టు 17వ తేదీ వరకు నిర్వహించిన తనిఖీల్లో 10,141 మంది వాహనదారులు పట్టుబడ్డారని పోలీసులు తెలిపారు.

లారీడ్రైవర్‌ను మోసగించిన సైబర్ దుండగులు

ఖమ్మంఅర్బన్: రెట్టింపు లాభం వస్తుందని నమ్మించి లారీడ్రైవర్ నుంచి రూ.83,940ను కాజేసిన ఘటన వెలుగులోకి వచ్చింది. ఖమ్మంఅర్బన్ (ఖానాపురం హవేలి) పోలీస్‌స్టేషన్లో సోమవారం సైబర్ క్రైమ్ కేసు నమోదైంది. సీఐ భానుప్రకాశ్ కథనంప్రకారం..నగరంలోని శ్రీరాంనగర్‌కు చెందిన షేక్‌జానీహుస్సేన్‌లారీడ్రైవర్‌గా పనిచేస్తున్నాడు.'పెట్టుబడి పెడితే రెట్టింపులాభం వస్తుంది' అంటూ సామాజిక మాధ్యమాల్లో వచ్చిన ప్రకటనను నమ్మి, మిత్రుడి సూచన మేరకు గత జూలై 23, 24 తేదీల్లో రూ.83,940 వివిధ దఫాలుగా చెల్లించాడు. తర్వాత సంబంధిత ఖాతా బ్లాక్ అవడంతో మోసపోయానని సైబర్ క్రైమ్ నంబర్ 1930కి ఫిర్యాదు చేశాడు. రూ.18 వేలు డ్రా కాకుండా నిలువరించారు. బాధితుడి ఫిర్యాదుపై కేసు నమోదు చేశామని సీఐ తెలిపారు.

ఖమ్మం మార్కెట్ ధరలు

(క్వింటాకు రూ.లలో)

	గరిష్ట	కనిష్ట
ఏసీ మిర్చి	14,500	8,000
మిర్చి	8,800	7,500
పత్తి	7,750	6,500

– ఖమ్మం వ్యవసాయం

పామాయిల్ గెలలు

టన్ను ధర	రూ.18,052

ఎన్నడూ ఎరగని కష్టం..

- యూరియా కోసం రైతుల అగచాట్లు వర్ణతీతం
- తెల్లవారుజాము నుంచే సొసైటీ కార్యాలయం వద్దకు వస్తున్న అన్నదాతలు
- పోలీసుల పహారా మధ్య కూపన్ల పద్ధతిలో యూరియా పంపిణీ



తల్లాడ: యూరియా కోసం సొసైటీ కార్యాలయం వద్ద బైఠాయించిన రైతులు

తల్లాడ/సుజాతనగర్/కరకగూడెం: యూరియా కోసం కనివినీఎరుగని కష్టం రైతులకొచ్చింది. యూరియా కోసం ఎన్నడూ తిప్పలు పడని రైతులు.. ప్రస్తుతం నానా అవస్థలు పడుతున్నారు. తెల్లవారింది మొదలు యూరియా కోసం పరుగులు పెడుతున్నారు. ఉదయం నాలుగు గంటలకే సొసైటీ కార్యాలయాల వద్ద బారులుదీరుతున్నారు. సోమవారం తెల్లవారుజామున 4 గంటల నుంచే తల్లాడ సొసైటీ కార్యాలయం వద్ద క్యూకట్టారు. తల్లాడ సొసైటీకి 911 కట్టల యూరియా వచ్చిందనే సమాచారం తెలియడంతో రైతులు పెద్ద సంఖ్యలో అక్కడికి చేరుకున్నారు. అతి పెద్ద సొసైటీ అయిన తల్లాడలో 15 గ్రామాలున్నాయి. ఈ గ్రామాలకు చెందిన వెయ్యి మంది రైతులు సొసైటీ కార్యాలయానికి వచ్చారు. వచ్చిన వారందరికీ యూరియా ఇవ్వాలనీ రైతులు పట్టుబట్టారు. బీజేపీ జిల్లా నాయకులు ఆపతి వెంకటరామారావు ఆధ్వర్యంలో సొసైటీ కార్యాలయం ఎదుట బైఠాయించి ఆందోళన చేపట్టారు. తల్లాడ మండల వ్యవసాయాధికారి ఎండీ తాజుద్దీన్, ట్రెయినీ ఎస్ఐ వెంకటేశ్, సొసైటీ సీఈఓ నాగబాబు ఆధ్వర్యంలో రైతులకు కూపన్లు పంపిణీ చేశారు. వచ్చిన ప్రతి రైతుకు ఒక కూపన్ చొప్పున పాస్‌బుక్, ఆధార్‌కార్డు జిరాక్స్‌లను పరిశీలించి అందించారు. ఈ కూపన్లు పొందిన రైతులకు మాత్రమే యూరియా కట్టలందజేశారు. కూపన్లు అందని రైతులు అధికారులతో వాగ్వాదానికి దిగారు. ఒకే రోజు యూరియా కట్టలు పంపిణీ చేయడం వీలు పడక మంగళవారం నాడు కూపన్లు పొందిన రైతుల్లో సగంమందికి యూరియా పంపిణీ చేస్తామని అధికారులు ప్రకటించారు. ఓ పక్క వర్షం పడుతున్నా రైతులు యూరియా కోసం తడుచుకుంటూనే నిల్చున్నారు. యూరియా కొరత కారణంగా వచ్చిన వారిలో చాలా మందికి యూరియా అందలేదు. యూరియా వేయాల్సిన తరుణంలో కొరత ఏర్పడటంతో ఏం చేయాలో దిక్కుతోచని స్థితిలో రైతులు కొట్టుమిట్టాడుతున్నారు. ఇక సుజాతనగర్ సొసైటీ గోదాముకు యూరియా వచ్చిన విషయం తెలుసుకున్న ఆయా గ్రామాలకు చెందిన పురుషులు, మహిళా రైతులు సోమవారం పెద్దఎత్తున తరలివచ్చారు. వ్యవసాయ పనులు ఊపందుకోవడంతో యూరియా అవసరం పెరిగింది. ఆధార్‌కార్డుకు ఒకే బస్తా చొప్పున ఇస్తామని చెప్పడంతో రైతులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. గంటలతరబడి వేచి ఉన్నా కొందరికే యూరియా బస్తాలు అందడంతో మరికొందరు బస్తాలు దొరక్క నిరాశతో వెనుదిరిగారు. అవసరానికి మించి యూరియాను కొనుగోలు చేసి నిల్వ ఉంచుకోవద్దని ఏఓ నర్మద తెలిపారు. మండలంలో రైతులందరికీ సరిపడా యూరియాను సరఫరా చేసేందుకు వ్యవసాయశాఖ సిద్ధంగా ఉందని చెప్పారు. కాగా, రైతులకు సరిపడా యూరియా అందించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని కౌలు రైతు సంఘం రాష్ట్ర నాయకులు నల్లగోపు పుల్లయ్య ఆరోపించారు. అలాగే, కరకగూడెంలోని ప్రాథమిక సహకార సంఘం సేల్ పాయింట్ వద్ద రైతులు జోరు వానను సైతం లెక్కచేయకుండా క్యూలో నిలబడి యూరియా కోసం నిరీక్షించారు. గొడుగులు పట్టుకుని, రెయిన్ కోట్లు వేసుకుని ఉదయం నుంచి సాయంత్రం వరకు నిరీక్షించినా కొందరు రైతులకు మాత్రమే యూరియా అందింది. స్టాక్ అయిపోవడంతో పలువురు ఖాళీ చేతులతోనే వెనుదిరగాల్సి వచ్చింది. దీంతో రైతులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

బూర్గంపాడు: అలాగే, బూర్గంపాడు మండలంలోని మోరంపల్లిబంజర పీఏసీఎస్ గోదాంకు వచ్చిన ఒక లారీ యూరియా కోసం సుమారు 500 మంది రైతులు రాగా.. పంపిణీ చేసేందుకు అధికారులు కూడా ఇబ్బంది పడ్డారు. రైతుకు ఒక యూరియా బస్తా చొప్పున విక్రయించినా ఇంకా చాలామంది రైతులకు అందక నిరాశగా వెనుదిరిగారు.

వారం నుంచి తిరుగుతున్నా యూరియా అందలేదు



వారం రోజులుగా యూరియా కోసం తల్లాడ సొసైటీ కార్యాలయం వద్దకు వచ్చి పోతున్నాను. యూరియాఒక్కకట్ట కూడా ఇవ్వ లేదు. యూరియా వేయాల్సిన తరుణంలో అందక పోవటంతో ఇబ్బంది పడాల్సి వస్తోంది. గతంలో ఎన్నడూ ఇంత ఇబ్బంది పడలేదు. యూరియా లోడ్ వచ్చిన రోజు ముందు వచ్చిన రైతులకే కూపన్లు ఇస్తున్నారు. చుట్టు పక్కల గ్రామాల రైతులు వచ్చే సరికి కూపన్లు అయిపోయాయని చెబుతున్నారు.

– వి.వంశీకృష్ణారెడ్డి, రైతు, పినపాక

పదెకరాలుంటే మూడు కట్టలిచ్చారు..



పదెకరాలుంటే మూడు యూరి యా కట్టలు కూపన్ల పద్ధతిలో ఇచ్చారు. కూపన్ల కోసం గంటల తరబడి వేచి చూడాల్సి వచ్చింది. ఎకరానికి ఒక కట్ట తప్పనిసరిగా యూరియా వేయాలి. దీంతో ఇంకా ఏడు కట్టలు అసవరం ఉన్నది. అధికారులను అడిగితే మళ్లీ లోడ్ వస్తే ఇస్తామంటున్నారు. యూరియా కొరత వేధిస్తోంది.

–కొలిపాక శ్రీనివాసరావు, రైతు, బిల్లుపాడు

రామకృష్ణాపురం రైల్వే బ్రిడ్జిపై కదలిక..

ఖమ్మంవైరారోడ్: చింతకాని మండలం రామకృష్ణాపురం 107 రైలు క్రాసింగ్ వద్ద బ్రిడ్జి నిర్మాణంపై కదలిక వచ్చింది. ఈ అంశం కేంద్ర ప్రభుత్వ పరిశీలనలో ఉందని రైల్వే మంత్రి అశ్వినీవైష్ణవ్ రాజ్యసభ ఎంపీ వద్దిరాజు రవిచంద్రకు తెలిపారు. ఈ మేరకు ఎంపీ రవిచంద్ర ఆగస్టు 7వ తేదీన రైల్వే మంత్రికి రాసిన లేఖలో రామకృష్ణాపురం గ్రామ సమీపంలోని 107 లెవల్ క్రాసింగ్ వద్ద బ్రిడ్జి నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని కోరుతూ విజ్ఞప్తి చేశారు. తరచూ గేటు మూసి ఉంచడం వల్ల గ్రామస్తులు పడుతున్న ఇబ్బందులను రైల్వే మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. దీనికి స్పందించిన రైల్వే మంత్రి అశ్వినీవైష్ణవ్ ఎంపీ రవిచంద్రకు తిరిగి లేఖ రాశారు. చింతకాని మండలం రామకృష్ణాపురం 107 లెవల్ క్రాసింగ్ వద్ద ఆర్వోబీ నిర్మాణం కోరుతూ చేసిన వినతిపై సాధ్యాసాధ్యాలకు సంబంధించి సమగ్ర నివేదిక కోరుతూ రైల్వే ఉన్నతాధికారులు ఆదేశించారని తెలిపారు.

వివాహితపై లైంగికదాడికి యత్నం

చింతకాని: మండలంలోని ఓ గ్రామానికి చెందిన వివాహితపై అదే గ్రామానికి చెందిన కె.జగంధర్ ఆదివారం రాత్రి లైంగికదాడికి యత్నించాడు. ఇంట్లో ఒంటరిగా ఉన్న సమయంలో లైంగికదాడి చేసేందుకు ప్రయత్నించగా ఆమె కేకలు వేయటంతో పరారయ్యాడు. ఎస్ఐ నాగుల్‌మీరా కేసునమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు తెలిపారు.


రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

తిరుమలాయపాలెం: మండల కేంద్రంలో ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతిచెందిన ఘటనపై సోమవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసుల కథనం ప్రకారం.. తిరుమలాయపాలెం గ్రామానికి చెందిన గుర్రాల రమేశ్ అలియాస్ గోకినపల్లి రమేశ్ (40) ఆదివారం రాత్రి మోటార్ సైకిల్‌పై కిరాణా దుకాణానికి వెళ్లి తిరిగి ఇంటికి వెళ్లేందుకు రోడ్డు దాటుతుండగా మరిపెడ నుంచి ఖమ్మం వైపు వెళ్తున్న మోటార్ సైకిల్ ఢీ కొట్టింది. తీవ్ర గాయాలపాలైన రమేశ్‌ను తిరుమలాయపాలెం సీహెచ్‌సీకి తరలించగా మృతిచెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

మధిర మండలంలో మరొకరు..

మధిర: రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలోని కృష్ణాపురం సమీపంలో సోమవారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. సిరిపురం గ్రామానికి చెందిన కనకపూడి నర్సింహారావు (55) పెట్రోల్ బంకులో పనిచేస్తున్న తన కుమార్తెను ద్విచక్ర వాహనంపై తీసుకుని వెళ్తున్నాడు. మధిర నుంచి ఖమ్మం వైపు వెళ్తున్న కారు ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టడంతో నర్సింహారావు అక్కడికక్కడే మృతి చెందాడు. ఘటనా స్థలాన్ని మధిర రూరల్ ఎస్ఐ లక్ష్మీభార్గవి సందర్శించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

ఖమ్మం ఫొటోగ్రాఫర్‌కు అవార్డు



సంపత్‌కుమార్



అవార్డు అందుకుంటున్న మోహినుద్దీన్

ఖమ్మంఅర్బన్: ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవాన్ని పురస్కరించుకొని రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి ఫొటోగ్రఫీ పోటీలను నిర్వహించగా ఖమ్మం నగరానికి చెందిన చావా సంపత్‌కుమార్ రెండు అవార్డులు గెలుచుకున్నారు. రైతు భరోసా, ఇందిరమ్మ ఇళ్లు, చేయూత, రాజీవ్ యువ వికాసం, జనరల్ విభాగాల్లో జరిగిన పోటీల్లో సంపత్ తీసిన చిత్రాలు ఆకర్షించాయి. అవార్డులను హైదరాబాద్‌లోని గ్రీన్ పార్క్ హోటల్‌లో ఆగస్టు 19న మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, రాష్ట్ర మీడియా అకాడమీ చైర్మన్ శ్రీనివాసరెడ్డి, రాష్ట్ర సమాచార శాఖ కమిషనర్ ప్రియాంక చేతుల మీదుగా ప్రదానం చేయనున్నారు.

మోహినుద్దీన్ ప్రతిభ

తిరుమలాయపాలెం: విజయవాడలోని ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా నిర్వహించిన ప్రదర్శనలో మండలంలోని గోల్‌తండా పరిధిలోని జింకలగూడేనికి చెందిన ఫొటోగ్రాఫర్ మోహినుద్దీన్ 'సర్టిఫికెట్ ఆఫ్ మెరిట్ అవార్డు – 2025'అందుకున్నారు. ఇండియా ఇంటర్నేషనల్ ఫొటోగ్రాఫిక్ కౌన్సిల్, ఫొటోగ్రఫీ అకాడమీ ఆఫ్ ఇండియా సంయుక్తంగా నిర్వహించిన పోటీల్లో మోహినుద్దీన్ తీసిన ఫొటో అవార్డుకి ఎంపికైంది. ఏపీ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ డాక్టర్ నూకసాని బాలాజీ, వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ కొంపల్లి సుందర్, ఫొటోగ్రఫీ అకాడమీ ఆఫ్ ఇండియా వ్యవస్థాపక చైర్మన్ తమ్మా శ్రీనివాసరెడ్డి, ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్, మాజీ ఎంపీ గోకరాజు గంగరాజు, టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్, సీఈఓ మల్లికార్జునరావు చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు.

నవంబర్‌లో పీడీఎస్‌యూ రాష్ట్ర మహాసభలు

సంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు పృథ్వీ, అనిల్



మాట్లాడుతున్న అనిల్ సాయిబోలా

ఖమ్మంమయూరిసెంటర్: ఖమ్మం జిల్లా కేంద్రంలో నవంబర్ మూడో వారంలో పీడీఎస్‌యూ రాష్ట్ర 23వ మహాసభలు నిర్వహించనున్నామని సంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు కాంపాటి పృథ్వీ, అనిల్ సాయిబోలా అన్నారు. సోమవారం ఖమ్మంలోని రామనర్సయ్య విజ్ఞాన కేంద్రంలో వారు విలేకరులతో మాట్లాడారు. 1960 దశకం చివరిలో ఉస్మానియా యూనివర్సిటీ కేంద్రంగా పీడీఎస్‌యూ పురుడు పోసుకుందని, జార్జిరెడ్డి, జంపాల చంద్రశేఖర ప్రసాద్, శ్రీపాద శ్రీహరి, కొలా శంకర్, చేరాలు వంటి ఎంతోమంది.. విద్యార్థుల హక్కుల కోసం, శాస్త్రీయ విద్య, సమానత్వ సమాజ స్థాపనను కాంక్షిస్తూ విద్యార్థి ఉద్యమంలో అమరులయ్యారన్నారు. ఎన్నో సామాజిక, ప్రజాతంత్ర, విప్లవోద్యమాలకు పురిటిగడ్డ అయిన ఖమ్మం జిల్లా కేంద్రంలో పీడీఎస్‌యూ రాష్ట్ర మహాసభలను నిర్వహించనున్నామని, వీటిని విజయవంతం చేయాలని కోరారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం విద్యారంగాన్ని కాషాయీకరించేందుకు దుర్మార్గ సంస్కరణలకు పూనుకుంటోందన్నారు. సమావేశంలో పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షులు బి.నరసింహారావు, నరేందర్, అఖిల్ కుమార్, సహాయ కార్యదర్శి వెంకటేశ్, ఎస్.సాయికుమార్, సురేశ్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు లక్ష్మణ్, అంగిడి కుమార్, అలవాల నరేశ్, మునిగల శివ, అజయ్, నాగరాజు, అషూర్, రాందాస్ తదితరులు పాల్గొన్నారు.

ఇరు వర్గాల మధ్య ఘర్షణ

యువకుడు మృతి



కార్తీక్ (ఫైల్)

ఖమ్మంఅర్బన్: మద్యం మత్తులో జరిగిన గొడవ ప్రాణాల మీదకు తెచ్చింది. నగరంలోని గోపాలపురం ప్రాంతంలో రెండు వర్గాల మధ్య జరిగిన ఘర్షణలో తీవ్రంగా గాయపడిన దేవందల కార్తీక్ (30) ఆస్పత్రిలో చికిత్సపొందుతూ సోమవా రం మృతిచెందాడు. ఖమ్మంఅర్బన్ (ఖానాపురం హవేలీ) పోలీస్ స్టేషన్‌లో కేసులు నమోదయ్యాయి. గోపాలపురం పరిధిలో మద్యం మత్తులో కొందరు యువకుల మధ్య ఘర్షణ జరిగింది. ఇరు వర్గాలకు చెదిన 11 మందిపై పోలీసులు కేసు నమోదు చేశారు. వారిలో ఏడుగురిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపారు. ఇద్దరు పరారీలో ఉండగా, మరో ఇద్దరు వైద్యశాలలో చికిత్స పొందుతున్నారు. వారిలో తీవ్రంగా గాయపడిన కార్తీక్ సోమవారం మృతి చెందాడు. కొందరు వ్యక్తులు ప్రేరేపించడమే ఘర్షణకు కారణమని మృతుడు కార్తీక్ కుటుంబ సభ్యులు, బంధువులు ఆరోపిస్తున్నారు. మృతుడి బంధువు దుర్గాభవాని ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. దాడి కేసును హత్య కేసుగా మార్చి దర్యాప్తు చేస్తామని సీఐ భానుప్రకాశ్ తెలిపారు.

విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ఆస్తి నష్టం



మంటలను ఆర్పుతున్న ఫైర్ సిబ్బంది

సత్తుపల్లిటౌన్: పట్టణంలోని మామిళ్లపల్లి కృష్ణయ్య కాంప్లెక్స్‌లో సోమవారం ఎండీ అస్లాం నివాసంలో జరిగిన షార్ట్ సర్క్యూట్‌తో రూ.10 లక్షల ఆస్తినష్టం సంభవించింది. స్థానికుల కథనం ప్రకారం వివరాలిలా ఉన్నాయి.. స్విచ్ బోర్డు నుంచి ఒక్కసారిగా మంటలు వ్యాపించటంతో ఇంట్లోని వస్తువులు కాలిబూడిదయ్యాయి. కుటుంబ సభ్యులు కట్టుబట్టలతో మిగిలారు. ఫైర్ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని మంటలను అదుపులోకి తెచ్చారు. ప్రభుత్వం ఆదుకోవాలని బాధితులు కోరారు.

దివ్యాంగురాలి పాట్లు..



తండ్రి సాయంతో మెట్లు దిగుతున్న అనూష

తండ్రి ఓ హోటల్‌లో పనిచేస్తున్నారు.. తల్లి ఇంటి వద్దనే ఉంటుంది.. తాను ఎంకాం చేసినా ఉపాధి లేక ఇబ్బందులు పడుతున్నామని, తాను 90 శాతం అంగవైకల్యం కలిగిన దివ్యాంగురాలినని, తనకు ఉపాధి చూపించాలని నగరంలోని శ్రీరాంనగర్ రోడ్డు నంబర్–9 ప్రాంతానికి చెందిన బొబ్బరాడ అనూష కలెక్టర్‌ను వేడుకున్నారు. సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన గ్రీవెన్స్‌కు తండ్రి సాయంతో వచ్చిన అనూష కలెక్టర్‌ను కలిసి తనకు విద్యార్హత ఉందని, ఏదైనా ఔట్‌సోర్సింగ్ ఉద్యోగం ఇప్పించాలని కోరారు.

–స్టాఫ్ ఫొటోగ్రాఫర్,ఖమ్మం

ఉరి వేసుకుని యువకుడి ఆత్మహత్య

ఖమ్మంరూరల్: మండలంలోని పల్లెగూడెంనకు చెందిన ఎస్.లెనిన్ (30) ఉరి వేసుకుని సోమవారం ఆత్మహత్యచేసుకున్నాడు. పోలీసుల కథనంప్రకారం.. లెనిన్ కొంతకాలం కిందట అదే గ్రామానికి చెందిన మానసను ప్రేమించి వివాహం చేసుకున్నాడు. వీరికి ఇద్దరు పిల్లలున్నారు. కొంతకాలంగా లెనిన్ మద్యానికి బానిసయ్యాడు. సోమవారం తన ఇంటి పక్కనే ఉన్న అత్తవారింటికి వెళ్లి ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరివేసుకున్నాడు. గమనించిన కుటుంబ సభ్యులు ఆయన్ను ఖమ్మంలోనిఓప్రైవేట్ ఆస్పత్రికితరలించగా.. అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ రాజు తెలిపారు.

ఇసుక ట్రిప్పర్ పట్టివేత

ఎర్రుపాలెం: ఏపీ నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న టిప్పర్‌ను పోలీసులు మండలంలోని మీనవోలు గ్రామంలో సోమవారం పట్టుకున్నారు. ఎస్ఐ రమేశ్‌కుమార్ కథనం ప్రకారం.. ఏపీ రాష్ట్రం ఎన్టీఆర్ జిల్లా ఉయ్యూరు గ్రామానికి చెందిన పీట్ల సాంబయ్య, వైరా గ్రామానికి చెందిన కాకాటి వినోద్‌కుమార్ ఏపీ నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుకను టిప్పర్‌లో తెలంగాణకు రవాణా చేస్తున్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు పోలీసులు దాడి చేసి ఎర్రుపాలెం మండలం మీనవోలు గ్రామంలో టిప్పర్‌ను పట్టుకున్నారు. కేసు నమోదుచేసి దర్యాప్తుచేస్తున్నట్లుఎస్ఐ తెలిపారు.

ఇంత జరిగినా నిర్లక్ష్యమే..

- కల్లూరు గిరిజన ఆశ్రమ పాఠశాలలో మళ్లీ ఫుడ్ పాయిజన్
- ఐటీడీఏ పీఓ హెచ్చరించినా తీరుమారని అధికారులు
- సాయంత్రం స్నాక్స్‌ను రాత్రి భోజనంలో పెట్టిన వైనం
- స్వాతంత్ర్య వేడుకల స్టాళ్ల ప్రదర్శనలోనూ బయటపడిన నిర్లక్ష్యం



కల్లూరులోని గిరిజన ఆశ్రమ పాఠశాల

ఖమ్మంమయూరిసెంటర్: సంక్షేమ శాఖల వసతి గృహాల నిర్వహణపై అధికారుల నిర్లక్ష్యం మరోసారి బట్టబయలైంది. విద్యార్థులకు సురక్షితమైన వసతి, భోజన సదుపాయాలు కల్పించాల్సిన బాధ్యతను పక్కన పెట్టి, వారి ఆరోగ్యాన్ని గాలికొదిలేస్తున్నారన్న ఆరోపణలు వస్తున్నాయి. 14రోజుల వ్యవధిలోనే ఒకే ఆశ్రమ పాఠశాలలో రెండు సార్లు విద్యార్థినులు ఫుడ్‌పాయిజన్‌కు గురికావడం తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. ఐటీడీఏ పీఓ హెచ్చరించినా.. జిల్లా అధికారులు, స్థానిక అధికారులు, సిబ్బందిలో మార్పు రాకపోవడంపై తీవ్ర ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. జిల్లాలోని కల్లూరు గిరిజన ఆశ్రమ పాఠశాలలో శనివారం రాత్రి తిన్న భోజనంతో విద్యార్థులు అస్వస్థతకు గురికావడం అధికారులు, సిబ్బంది అలసత్వానికి నిదర్శనమని విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థి సంఘాల నేతలు విమర్శిస్తున్నారు.

వరుస ఘటనలు..

కల్లూరు గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలో ఈ నెల 3న ఆదివారం అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యంతో మధ్యాహ్నం వండిన చికెన్ రాత్రి తినడం, ఆ మరునాడే ఉదయం ఉడికి ఉడకని కిచిడి తినడంతో 15 మందికి పైగా విద్యార్థినులు అస్వస్థతకు గురయ్యారు. ఆ ఘటన మరువక ముందే ఈ నెల 16న శనివారం సాయంత్రం విద్యార్థినులకు అందించాల్సిన స్నాక్స్ (క్యాబేజీ పకోడి) రాత్రి భోజనంతో పాటు అందించడంతో పలువురు విద్యార్థినులు అస్వస్థతకు గురయ్యారు. ఒకే ఆశ్రమ పాఠశాలలో వరుసగా రెండు ఘటనలు చోటు చేసుకోవడంతో నిర్వహణ, జిల్లా అధికారుల పర్యవేక్షణ ఏస్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు.

సమయపాలన లేదు..

గిరిజన సంక్షేమ వసతిగృహాలు, ఆశ్రమ పాఠశాల ల్లో విద్యార్థులకు అందించాల్సిన అల్పాహారం, భోజనం, స్నాక్స్ వంటి వాటికి సమయపాలన లేదనే విమర్శలు వస్తున్నాయి. మధ్యాహ్నం వండిన చికెన్ సాయంత్రం, సాయంత్రం 4 గంటల సమయంలో అందించాల్సిన స్నాక్స్ రాత్రి భోజనంతో పెడుతున్నారు. జిల్లాలోని అన్ని గిరిజన వసతిగృహాలు, ఆశ్రమ పాఠశాలల్లో ఇలానే జరుగుతోందా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కల్లూరులో శనివారం సాయంత్రం తయారు చేసిన స్నాక్స్ రాత్రి భోజనంతో అందించడంపై అధికారులు ఆరా తీ యగా.. హెచ్‌ఎం సరుకులు ఆలస్యంగా ఇచ్చా రని వర్కర్లు, వర్కర్ ఆలస్యంగా వంట తయారు చేశా రని హెచ్‌ఎం ఫిర్యాదు చేసినట్లు సమాచారం. కాగా, కల్లూరు ఆశ్రమ పాఠశాలలో ఐటీడీఏ పీఓ పర్యటించి వార్డెన్ నిర్లక్ష్యంతోనే ఫుడ్ పాయిజన్ జరిగినట్లు నిర్ధారించి సస్పెండ్ చేశారు. ఆహారం తయారు చేసిన సిబ్బందిపై చర్యలు తీసుకోలేదు. ఇలాంటి ఘటనలు పునరావృతం కావొద్దని అధికారులు, హెచ్‌ఎంలు, వసతిగృహ సంక్షేమ అధికారులను హెచ్చరించారు. అయినా వారు సీరియస్‌గా తీసుకున్నట్లు కనిపించడం లేదు. అదే ఆశ్రమ పాఠశాలలో మరో ఘటన చోటు చేసుకుందనే ఆరోపణలు ఉన్నాయి. వంట చేసిన వారిని అధికారులు వేరే వసతిగృహానికి మార్చి చేతులు దులుపుకున్నట్లు తెలిసింది.

ఉప ముఖ్యమంత్రి ఆగ్రహం..

గిరిజన అభివృద్ధి శాఖ అధికారుల నిర్లక్ష్యం రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ముందే బయటపడింది. ఈ నెల 15న స్వాతంత్ర్య వేడుకల సందర్భంగా పోలీస్ పరేడ్ మైదానంలో వేడుకలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క.. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ సంక్షేమశాఖల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టాళ్లలో నోట్‌బుక్స్‌పై కేసీఆర్, సత్యవతిరాథోడ్ ఫొటోలు ఉండడంతో తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇదిలా ఉండగా.. కల్లూరు ఆశ్రమ పాఠశాల ఘటనపై జిల్లా గిరిజన అభివృద్ధి అధికారిణి విజయలక్ష్మిని వివరణ కోరగా.. సాయంత్రం చేసిన స్నాక్స్ రాత్రి భోజనంతో పాటు తినడంతో విద్యార్థినులకు కడుపునొప్పి వచ్చిందని, ఘటనలో వర్కర్‌ను అక్కడి నుంచి మార్చామని తెలిపారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

ఖమ్మంరూరల్: మండలంలోని కరుణగిరి టీఎస్‌జీవోస్‌కాలనీ రోడ్ నంబర్–6కు చెందిన దేవరకొండ వెంకట్ అనిల్‌కుమార్ (41) వాటర్ హీటర్ షాక్ తగిలి అక్కడికక్కడే మృతి చెందిన ఘటన సోమవారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. వాటర్ ప్లాంట్ నిర్వహించే అనిల్‌కుమార్ రోజు మాదిరిగానే ఉదయం స్నానం చేయడానికి, నీళ్ల వేడిచేసేందుకు వాటర్ హీటర్ ప్లగ్ పెట్టి స్విచ్ వేయగా విద్యుదాఘాతానికి గురై పడిపోయాడు. మరోగదిలో నిద్రపోతున్న భార్య శైలజ మేల్కొని అపస్మారక స్థితిలో పడి ఉన్న భర్తను చూసి కేకలు వేయగా పక్కింటి వారు వచ్చి సీపీఆర్ చేశారు. కానీ, అప్పటికే మృతి చెందాడు. భార్య ఫిర్యాదు మేరకు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఖమ్మం ప్రభుత్వాస్పత్రికి తరలించి కేసు నమోదు చేసినట్లు సీఐ రాజు తెలిపారు.

పెట్రోల్ డబ్బాతో మహిళ హల్‌చల్

నేలకొండపల్లి: ఓ మహిళ పెట్రోల్ డబ్బాతో హల్‌చల్ చేసింది. స్థానికుల కథనం ప్రకారం.. నేలకొండపల్లికి చెందిన ఓ మహిళ ఇంట్లో రెండు రోజుల నుంచి తగాదాలు నడుస్తున్నాయి. కోడలిపై అత్త పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. దీంతో కోడలు సోమవారం అంబేడ్కర్ సెంటర్‌లో పెట్రోల్ డబ్బా పట్టుకుని హల్‌చల్ చేసింది. కుటుంబ సభ్యులతో వాగ్వాదానికి దిగింది. తాను ఆత్మహత్య చేసుకుంటానని పెట్రోల్ పోసుకుంది. స్థానికులు గమనించి అడ్డుకుని అక్కడి నుంచి పంపించారు.

హత్య కేసు నిందితుడికి జీవిత ఖైదు

ఖమ్మంలీగల్: హత్య కేసులో నిందితుడైన రఘునాథపాలెం మండలం కోటపాడుకు చెందిన బాలంటు నాని (22)కి జీవిత ఖైదు, రూ.10,000 జరిమానా విధిస్తూ రెండో అదనపు సెషన్స్ కోర్టు న్యాయమూర్తి వెంపటి అపర్ణ సోమవారం తీర్పు వెల్లడించారు. మద్యానికి అలవాటు పడిన నిందుతుడు నాని అదే గ్రామానికి చెందిన తేలూరి రమేశ్‌ను డబ్బుల కోసం బెదిరించాడు. ఇవ్వకపోయే సరికి అదును చూసి, 2023 జనవరి 12న రమేశ్‌ను కత్తితో పొడిచి హత్య చేశాడు. మృతుడి సోదరుడు తేలూరి వీరబాబు ఫిర్యాదు మేరకు రఘునాథపాలెం పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు కాగా పోలీసులు కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. వాదోపవాదాలు విన్న న్యాయమూర్తి పైవిధంగా తీర్పు చెప్పారు.